


14 నుండి శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-అరకులోయరూరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాల మేరకు నూతనంగా ఎన్నుకోబడిన పెసా కమిటీ సభ్యులకు ఈనెల 14,15,18,19,22,24 తేదీల్లో అనంతగిరి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు. పెసా కమిటీ ఉపాధ్యక్షులు, కార్యదర్శులు హాజరు కావాలని పేర్కొన్నారు. ఈ శిక్షణా కార్యక్రమములో పాల్గొనే వారు ఆధార్ నంబర్ కు లింకు చేయబడిన మొబైల్ ఫోన్‌తో తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. శిక్షణా సమయం ఉదయము 9 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించబడతాయని తెలిపారు. .ఈ శిక్షణ తరగతులకు హాజరయ్యే విధముగా ఆయా గ్రామాలకు చెందిన సంబంధిత పంచాయతీ కార్యదర్శులు తగు చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ కోరారు.

తాగునీటి కోసం.. గిరిజన మహిళల వెతలు

-ఊటగెడ్డలే ఆధారం- వ్యాధులబారిన పడుతున్న వైనం

ప్రజాశక్తి-చింతపల్లి: మండలంలోని కిటుముల పంచాయితీ పొలంబంద గ్రామంలో ఇంటింటి కుళాయిలు గత రెండు నెలలుగా మరమ్మతులకు గురి కావడంతో తాగునీటికై అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని , కలుషితమైన ఊట గెడ్డ నీటిని సేవించి రోగాల పాలవుతున్నామని వార్డు సభ్యుడు మర్రి సుమన్, గ్రామ పెద్ద మర్రి వీరబాబు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక పాత్రికేయులతో వారు మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా జలజీవన్ మిషన్ పథకం ద్వారా రెండు సంవత్సరాల క్రితం గ్రామంలో సుమారు 50 ఇంటింటి కొళాయిల నిర్మాణం చేపట్టారని తెలిపారు. గత రెండు నెలల క్రితం గ్రామంలో కుళాయిలు మరమ్మతులకు గురయ్యాయని, ఈ విషయమై పంచాయతీ పాలకవర్గం, అధికారులకు పలుమార్లు వేడుకొన్నా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి కోసం గ్రామంలోని మహిళలు ఊటగడ్డలను ఆశ్రయిస్తున్నారని, ఈ నీరు తాగడంతో గ్రామంలో అనేకమంది అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామం చివర ఉన్న ఊటగెడ్డలు చెత్తాచెదారంతో నిండిపోయి కలుషితమయ్యాయని, అదే నీటిని గ్రామస్తులు తాగునీరుగా వినియోగించడం జరుగుతుందన్నారు. తమ సమస్యను పంచాయతీ పాలకవర్గం దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని, ఆ సమస్యని ఇంతవరకు పరిష్కరించక పోవడం బాధాకరమన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు మొక్కుబడిగా సందర్శించి పరిష్కరిస్తామని భరోసాలిచ్చి ఆనక మర్చి పోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి మరమ్మత్తులకు గురైన ఇంటింటి కొళాయిలకు మరమ్మత్తు చేపట్టి గ్రామంలో తాగునీటిని అందించేందుకు కృషి చేయాలని గ్రామస్తులు పాంగి చిట్టి బాబు, మాజీ గ్రామ వాలంటీర్ మర్రి చంటిబాబు, కొర్ర రాంబాబు, హరిప్రసాద్, గ్రామంలోని మహిళలు కోరుతున్నారు.



పని చేయని కుళాయి



ఊటగెడ్డల నీటిని పట్టుకుంటున్న గిరిజన మహిళలు



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అప్పలనాయుడు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయగౌరిని గెలిపించాలి

ప్రజాశక్తి- కొయ్యూరు

ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం యుటిఎఫ్ బలపర్చిన పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయ గౌరి మొదట ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వై.అప్పలనాయుడు ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కొయ్యూరు మండలం పెద్ద మాకవరం జిటిడబ్ల్యూఏ గర్ల్స్ స్కూలు, నడిపాలెం శరబన్నపాలెం జిటిడబ్ల్యూఏ బాయ్స్ స్కూల్లో బుధవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల కోసం పోరాడే వారిని గెలిపించాలన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై నికరంగా పని చేసేది పిడిఎఫ్ ఎమ్మెల్సీలు మాత్రమేనని పేర్కొన్నారు. శాసన మండలిలో మన సమస్యలపై గళం ఎత్తే వారు, మన పోరాటాలకు అండగా నిలబడే వారు, మన కష్టసుఖాల్లో పాలుపంచుకునే వారు పిడిఎఫ్ ఎమ్మెల్సీలు మాత్రమేనని చెప్పారు.

బంద్ జయప్రదంపై కృతజ్ఞతలు

-అసెంబ్లీ సమావేశంలో ఆదివాసులకు 100 శాతం రిజర్వేషన్‌పై చట్టం చేయాలి

-ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిలో సురేంద్ర

ప్రజాశక్తి- అరకులోయ: ఈనెల 11న జరిగిన రాష్ట్ర మన్యం బంద్ విజయవంతం చేసి పోరాడి విజయం సాధించిన ప్రతి ఒక్కరికి ఆదివాసి అఖిలపక్ష ప్రజాసంఘాలు ఉద్యమ అభినందనలు తెలియజేసారు. ఈ మేరకు అరకు వేలి ఆదివాసి గిరిజన సంఘం కార్యాలయంలో ఆదివాసి ఐక్యపక్ష ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిలో సురేంద్ర, అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ, 1/70 చట్టం పరిరక్షణకై 11న జరిగిన రాష్ట్ర మన్యం బంద్ ఆదివాసి ప్రజానీకం, ఉద్యోగ, ఉపాధ్యాయులు, కార్మికులు, వర్తకులు ఆదివాసి శ్రేయోభిలాషులు, ఆదివాసీ ప్రజా సంఘాలు రాష్ట్ర మన్యం బంద్‌కు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. ఆదివాసులు ఐక్య పోరాటంతో రాష్ట్ర ప్రభుత్వం దిగి వచ్చిందని 1/70 చట్టం పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ప్రకటించడం హర్షణీయమని తెలిపారు. 1/70 చట్టం పటిష్టంగా అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. ఈనెల 24 నుండి జరిగే రాష్ట్ర అసెంబ్లీ సమావేశంలో 1/70 చట్టం పరిరక్షణకై చర్చించాలని ఆదివాసి ప్రాంతంలో 100శాతం రిజర్వేషన్ నియామక చట్టం చేయాలని, ఆదివాసి స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతగిరి మండలంలో గుజ్జల చిట్టెంపాడ లో హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణం కోసం నవయుగ కంపెనీకి రాష్ట్ర ప్రభుత్వ ఇచ్చిన అనుమతులు తక్షణమే రద్దు చేయాలని, పాడేరు మెడికల్ కళాశాలలో 100శాతం ఆదివాసులతో ఉద్యోగాలు భర్తీ చేయాలని ఆదివాసి ప్రాంతంలో సమగ్ర అభివృద్ధి కోసం రోడ్లు, వంతెనలు నిర్మాణాలు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసి ప్రాంతంలో కాఫీ, మిరియాలు, చింతపండు అడ్డాకులు ఇతర అటవీ ఉత్పత్తుల పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో దండకారణ్య విమోచన సమితి జిల్లా ఉపాధ్యక్షులు కొర్ర ప్రసన్నకుమార్, పెసా కమిటీ ఉపాధ్యక్షులు ఎం.రమేష్ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా నాయకులు పి.రామన్న, కే.రామారావు పాల్గొన్నారు.

జిమాడుగుల : సీఎం చంద్రబాబు నాయుడు, గిరిజన శాఖ మంత్రి సంధ్యారాణి ప్రకటనతో నేటి బుధవారం బంద్ విరమించుకుంటున్నట్టు స్థానిక విలేకరులకు ఆదివాసి గిరిజన సంఘం అధ్యక్షులు సాగిన ధర్మానపడాల్ తెలిపారు, 1/70 చట్టం ప్రతిష్ఠంగా అమలు చేస్తామని గిరిజన ప్రాంతంలో ు 100శాతం గిరిజనులకే ఉద్యోగాలు ఇచ్చేలా ఉద్యోగ నియామక చట్టం చేయాలన్నారు.



మాట్లాడతున్న సురేంద్ర



రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఎంపిడిఒ యాదగిరీశ్వరరావు

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : విధి నిర్వహణలో సచివాలయ సిబ్బంది అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని స్థానిక ఎంపీడీవో లోకుల యాదగిరిశ్వరరావు అన్నారు. మండలంలోని కింద్ర సచివాలయాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలో కొంతమంది ఉద్యోగులు రిజిస్టర్ మూమెంట్ నమోదు చేయకుండా ఫీల్డ్‌కి వెళ్లి పోవడంతో దీనిపై పంచాయతీ కార్యదర్శిని ఎందుకిలా జరిగిందని ఎంపీడీవో నిలదీశారు. ఈ విషయంపై తనకి వివరణ ఇవ్వాలని కార్యదర్శిని కోరారు. అనంతరం గ్రామంలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రం పనితీరును పర్యవేక్షించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి పిఒ

అంగన్వాడీ కేంద్రాల్లో మెనూ అమలు చేయండి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: పోషకాహార లోపం ఉన్న చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి పోషకాహారం అందించాలని ఐటిడిఎ ఇన్చార్జి పిఒ, జెసి ఎంజె అభిషేక్ గౌడ్ ఆదేశించారు. బుధవారం ప్రాజెక్టు అధికారి కార్యాలయంలో 11 మండలాల సిడిపిఒ లతో అంగన్వాడీ సేవలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంగన్వాడీలలో మెనూ సక్రమంగా అమలు చేయాలని చెప్పారు. టేక్ హెూం రేషన్ గర్భిణీలు, బాలింతలు సక్రమంగా వినియోగించుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. అంగన్వాడీలకు సరఫరా చేస్తున్న పాలు, గుడ్లు నాణ్యతలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని సూచించారు. ఏ పంచాయతీలలో పోషకాహార లోపం ఉన్న పిల్లలు ఎక్కువగా ఉన్నారని అడిగి తెలుసు కున్నారు. చిన్నారుల హాజరు, డేటా ఎంట్రీ సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. చిన్నారుల ఎదుగుదలను పర్యవేక్షించాలన్నారు. కిషోర వికాసం, సఖీ గ్రూపుల ఏర్పాటుపై ఆరా తీసారు. బాల్య వివాహల నివారణకు తగిన చర్యలు చేపట్టాలని, అవసరమైన చోట పోలీస్ సహకారం తీసుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో ఐసిడిఎస్ పిడి ఎన్.సూర్యలక్ష్మి, 11 మండలాల సిడిపిఒలు పాల్గొన్నారు.

మిలీషియా జిల్లా ఇన్‌ఛార్జి సంతు లొంగుబాటు

ప్రజాశక్తి-అల్లూరి జిల్లా

మావోయిస్టు పార్టీ చత్తీస్‌ఘడ్ రాష్ట్రం సుకుమా జిల్లా మిలీషియా ఇన్‌ఛార్జి కూర సంతు బుధవారం పోలీసుల ఎదుట లొంగిపోయారు. చింతూరు ఎఎస్‌పి కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేసు వివరాలను రంపచోడవరం అడిషనల్ ఆపరేషన్స్ ఎస్‌పి జగదీష్ అడహళ్లి వెల్లడించారు. చత్తీస్‌ఘడ్ రాష్ట్రం సుకుమా జిల్లా కుంట పోలీస్ స్టేషన్ పరిధిలో దుర్మ గ్రామానికి చెందిన 25 ఏళ్ల కూర సంతు మావోయిస్టు పార్టీ మిలీషియా సుకుమా జిల్లా ఇన్‌ఛార్జిగా పని చేస్తున్నారు. మావోయిస్టు పార్టీ సిద్ధాంతాల పట్ల విశ్వాసం సన్నగిల్లి లొంగిపోయినట్లు తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని, జనజీవన స్రవంతిలో కలిసి వ్యక్తిగతంగా అభివృద్ధి చెందాలని ఎఎస్‌పి జగదీష్ సూచించారు. ప్రభుత్వ పరంగా రావలసిన అన్ని రాయతీలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో చింతూరు ఎఎస్పీ పంకజ్ కుమార్ మీనా, సిఐ దుర్గాప్రసాద్, ఎస్సై పి.దివాకర్, ఈకోవై 42 బిఎస్ సిఆర్పిఎఫ్ అధికారులు పాల్గొన్నారు.



కూర సంతుకు తక్షణ సహాయం అందిస్తున్న ఎఎస్‌పిలు జగదీష్, పంకజ్ కుమార్ మీనా తదితరులు



వైసిపి మండల అధ్యక్షుడికి సన్మానం

ప్రజాశక్తి-డంబ్రిగుడ: మండల వైసిపి మండల అధ్యక్షుడిగా నూతనంగా నియమకమైన పి.పరశురాంను ఆ పార్టీ ప్రజా ప్రతినిధులు సన్మానించారు. మండల కేంద్రంలోని ఆ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు ఆయనకు శాలువను కప్పి సన్మానించారు. అధ్యక్షుడిగా బాధ్యతను అప్పగించిన అధినేతకు, ఎమ్మెల్యే మత్స్యలింగకు రుణపడి ఉంటానన్నారు. నాయకులు, ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకుని పార్టీ పటిష్టతకు పాటుపడతానని ఆయన అన్నారు. వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచులు నాగేశ్వరరావు, వెంకటరావు, నాయకులు సింహాచలం, క్రిష్ణారావు, నర్సింగరావు, తుంనాథ్, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు

నిత్యావసరాలు తెచ్చుకోవడానికి గుర్రాలే దిక్కు

ప్రజాశక్తి-సీలేరు

జికె.వీధి మండలం గాలికొండ పంచాయితీ పాత్రునిగుంట గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. నిత్యవసర సరుకులు తెచ్చుకోవాలంటే గుర్రాలే వారికి దిక్కు. అత్యవసరమయంలో వైద్యశాల పొందడానికి నానా అవస్థలు పడుతున్నారు. గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడం గుర్రాలపై రాకపోకలు సాగిస్తూ ఉంటారు. పాత్రునిగుంట గ్రామంలో 21 పివిటిజి కుటుంబాలు నివసిస్తున్నాయి. వ్యవసాయం కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇటీవల ప్రభుత్వం జన్ మాన్ పథకంలో భాగంగా 18 ఇళ్లు మంజూరు చేసింది. ఇళ్ల నిర్మించుకోవడానికి ఇసుక, సిమెంట్, పిక్కలు, ఇతర సామగ్రి గ్రామానికి తరలించాలంటే రహదారి సౌకర్యం లేకపోవడంతో కష్టతరంగా మారింది. మంజూరైన ఇళ్లు ఏ విధంగా నిర్మించుకోవాలో అర్థం కాని పరిస్థితి నెలకొనడంతో గిరిజనులు అయోమయానికి గురవుతున్నారు. జిల్లా కలెక్టర్, ఐటిడిఏ పిఒ స్పందించి పాత్రుని గుంట గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు రహదారి సౌకర్యం ఏర్పాటు చేయకపోతే ప్రభుత్వం మంజూరు చేసిన ఇల్లు నిర్మించుకునే పరిస్థితి లేదని వారు ఆందోళనకు గురవుతున్నారు.



గుర్రాలపై నిత్యావసరాలు తీసుకెళ్తున్న గిరిజనులు

నేటి నుండి పీసా కమిటీల సభ్యులకు శిక్షణ

ప్రజాశక్తి-రంపచోడవరం

పీసా గ్రామ కమిటీ సభ్యులకు ఈ నెల 13 నుండి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సుండం శ్రీనివాస్ దొర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రంపచోడవరం మండలంలో ఉన్న 19 గ్రామ పంచాయతీలలో 49 పీసా గ్రామ కమిటీల్లో ఉన్న సర్పంచులు,ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు, పీసా కమిటీ ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, గ్రామ సమైక్య సంఘం లీడర్లకు ఈ శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఈ నెల 13 నుండి 22వ తేదీ వరకు రోజుకి రెండు బ్యాచ్‌లు చొప్పున, ఒక్కొక్క బ్యాచ్‌లో 100 చొప్పున మొత్తం 1500 మంది సభ్యులకు శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్టు తెలిపారు. రంపచోడవరం మండల పరిషత్ సమావేశ మందిరం మండల రిసోర్స్ సెంటర్ వద్ద శిక్షణ తరగతులు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.



నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

మౌనిక మృతికి సిపిఎం నేతల సంతాపం

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని ములకపల్లి గ్రామంలో సీపీఎం కార్యకర్త ముత్తిబోయిన శ్రీనివాస్ కుమార్తె మౌనిక అనారోగ్యంతో బుధవారం మృతి చెందగా, సిపిఎం నాయకులు సంతాపం తెలియజేశారు. మౌనిక మృతదేహానికి నివాళులర్పించారు. శ్రీనివాస్ కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చి, ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్, జిల్లా కమిటీ సభ్యులు సోయం చిన్నబాబు, మండల నాయకులు పంకు సత్తిబాబు, పోడియం శ్రీరామ్మూర్తి, వాళ్ల కృష్ణారెడ్డి, కొండారెడ్డి, ఎం.సత్యనారాయణ, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యం సరికాదు

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం సీలేరులో బస్ షెల్టర్ విషయంలో ఇంజనీరింగ్ అధికారులు నిర్లక్ష్యం తగదని సీలేరు సర్పంచ్ దుర్జో పేర్కొన్నారు. స్థానిక విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ సీలేరు మార్కెట్ రోడ్‌లో ఎన్నో సంవత్సరాలుగా ఉన్న మరుగుదొడ్లు, బస్సు షెల్టర్ శిథిలావస్థకు చేరడంతో గత ప్రభుత్వ హయాంలో నాటి అరకు ఎంపీ జి.మాధవి దీనిని పరిశీలించి ఐదు లక్షల రూపాయలు ఎంపీ నిధులు మంజూరు చేశారని గుర్తు చేశారు. 2024లో పనులు నిర్వహణకు అగ్రిమెంట్ కూడా జరిగిందని తెలిపారు. ఎపి జెన్‌కో అధికారులు అనుమతులు ఉన్నప్పటికీ నేటి వరకు పనులు ప్రారంభించకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. వైసీపీ మండల ఎస్టీ సెల్ అధ్యక్షురాలు స్వర్ణలత మాట్లాడుతూ బస్సు షెల్టర్, మరుగుదొడ్లు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని, అయినా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు వెంటనే చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. లేకుంటే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు నాళ్ల వెంకట్రావు, బుజ్జి, కిలో మోహనరావు, డోంబు నూకరాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న సర్పంచ్ దుర్జో, వైసిపి నాయకులు



అవగాహన కల్పిస్తున్న ఎఒ లీలావతి

పథకాలపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి-హుకుంపేట: వ్యవసాయ శాఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై మండల కేంద్రంలోని బుధవారం రైతులను అవగాహన కల్పించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో భూమి ఉన్న ప్రతి రైతుకు ప్రభుత్వం ఒక ప్రత్యేక గుర్తింపు సంఖ్యను కేటాయించడం జరుగుతుందని మండల అగ్రికల్చర్ ఆఫీసర్ లీల వతి పేర్కొన్నారు. దీని ద్వారా రైతులకు వ్యవసాయ సేవలను సులభంగా, పారదర్శకంగా మరింత అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, ఇతర వ్యవసాయ సంబంధిత సేవలను పొందడానికి ఈ సంఖ్య అధికారికంగా గుర్తింపుగా పనిచేస్తుందన్నారు. ఆధార్ అనుసంధానమైన ఫోన్ నెంబరు, పట్టాదారులు పాస్ బుక్ తీసుకొని గ్రామంలో రైతు సేవ కేంద్రం సిబ్బందికి కలిసి ఈనెల 28వ తేదీన నమోదు చేసుకోవాలని ఆమె కోరారు. భవిష్యత్తులో పీఎం కిసాన్ వంటి పథకాలు లబ్ధి పొందాలంటే ఈ గుర్తింపు సంఖ్య తప్పనిసరి అని తెలిపారు.

సమస్యలపై అర్జీల స్వీకరణ

ప్రజాశక్తి- జిమాడుగుల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పిజిఆర్ఎస్ మీకోసం కార్యక్రమంలో భాగంగా ప్రతి మంగళవారం తహసిల్దార్ కార్యాలయంలో అర్జీలను స్వీకరించడం జరుగుతుందని స్థానిక తసిల్దార్ జి రాజ్ కుమార్ బుధవారం ప్రకటనలో తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రెవెన్యూ సంబంధిత సమస్యలపై ఎటువంటి సమస్యలున్నా లబ్ధిదారులు ప్రతి మంగళవారం ఆర్జీలను సమర్పించు కోవచ్చన్నారు. ఆర్జీలను ఆన్లైన్లో నమోదు చేసి వెంటనే పరిష్కార దిశగా చర్యలు చేపడతామన్నారు భూ వివాద సమస్యలున్నా మిగతా రోజులు కూడా ఆర్జీలను పెట్టుకోవచ్చన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

కాలువను పరిశీలిస్తున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి -నక్కపల్లి: పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో డి.సీతారామరాజు సూచించారు. మండలంలోని మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో బుధవారం జరుగుతున్న కాలువల పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. పారిశుద్ధ్య కార్మికులు మురికి కాలువలో పేరుకు పోయిన చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సీతారామరాజు మాట్లాడుతూ, గ్రామంలో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య కార్మికులతో కాలువలు శుభ్రం చేయించాలని పంచాయతీ కార్యదర్శి సత్యంకు సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే దోమలు ప్రబలి రోగాలు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. ప్రజలు రోగాలు బారిన పడకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలన్నారు. రాజయ్యపేట సచివాలయాన్ని ఎంపీడీవో సీతారామరాజు సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. సచివాలయం ద్వారా ప్రజలకు అందించే సేవలను విస్తృతం చేయాలని సిబ్బందికి సూచించారు. పనులు పెండింగ్ లేకుండా చూడాలన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి- కొత్తకోట: విద్యార్థులకు బాల్యవివాహాలు, సైబర్ నేరాలపై ఆడియో, వీడియో ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ మహిళా పోలీస్ కిరణ్ కుమారి మాట్లాడుతూ, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు పలు పాఠశాలల విద్యార్థులకు బాల్యవివాహాలతో కలుగు అనర్థాలు, సైబర్ నేరాలు, గుడ్, బ్యాడ్ టచ్, ఫోక్సో చట్టంపై అవగాహన కల్పించామని ఆమె తెలిపారు.

అంధకారంలో అరకులోయ

-వెలగని వీధిలైట్లు
-పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయ పట్టణంలో వీధిలైట్లు వెలగక పోవడంతో స్థానికులు అంధకారంలో మగ్గుతున్నారు. పంచాయతీ పాలకులు, అధికారులు పట్టించుకోక పోవడంతో అరకులోయ పట్టణంలోని వీధి దీపాలు వెలగక వారం రోజుల నుండి అమావాస్య చీకట్లు తలపిస్తుందని స్థానిక గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. అరకులోయ పట్టణం పర్యాటక కేంద్రం కావడంతో దేశ నలుమూలల నుంచి వచ్చే పర్యాటకులు వీధి లైట్లు వెలగక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీధి లైట్లు వెలగక పోవడంతో వాహనాలు ఢీకొని గురవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై పశువులు అడ్డంగా ఉంటుండడంతో వాహన చోదకులు నిత్యం రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు ప్రధాన రహదారిపై ఉన్న వీధి లైట్లు వెలగక పోవడంతో రోడ్డుపై పశువులు తిరుగుతుండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఎన్టీఆర్ గ్రౌండ్ నుండి గ్రీన్ వేలీ జంక్షన్ వరకు ఉన్న లైట్లు పట్టిపోయి వెలగ లేదు. దీనిపై పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదని స్థానిక గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ అధికారులు వేలాది రూపాయల పన్నులు వసూలు చేస్తున్నారు. వీధిలైట్లు మరమ్మతు ఎందుకు చేయ లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి లైట్లు మరమ్మతు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేశారు.

జిసిసి డిపో, షాపుల తనిఖీ



డిపోను తనిఖీ చేస్తున్న జెసి అభిషేక్‌గౌడ

ప్రజాశక్తి -పాడేరు : మండలంలోని జిసిసి డిఆర్ డిపోను, కిండంగి ఎఫ్‌పి షాపును ఐటీడీఏ ఇన్చార్జి ప్రాజెక్టు అధికారి, జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిత్యావసర సరుకుల, బియ్యం నిల్వలను పరిశీలించారు. ఆయిల్ ఇతర నిత్యావసర వస్తువుల తేదీలను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేసి గోడౌన్ ఇంచార్జ్ సంతకాలు లేనందున అసంతృప్తి వ్యక్తపరిచారు. అనంతరం కిండంగి చౌక ధరల దుకాణం పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. సకాలంలో రేషన్ అందుతుంది, లేనిది ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎండియు ద్వారా ఎండియు ద్వారా సరఫరా చేస్తున్న నిత్యావసర వస్తువులను పరిశీలించారు. కందిపప్పు సరఫరా తక్కువగా ఉండటంపై ప్రశ్నించారు. రాజ్మా సరఫరా ఎక్కువగా ఉన్నప్పుడు, కందిపప్పు తక్కువ అమ్మకాలు జరుగు తున్నందున సరఫరా తగ్గించినట్లు పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ బి. గణేష్ వివరించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై కార్పొరేషన్ జిల్లా మేనేజర్ బి.గణేష్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ నల్లన్న, స్థానిక విఆర్ఓ తదితరులు పాల్గొన్నారు.

కందమామిడి ఆశ్రమ పాఠశాల తనిఖీ
హెచ్‌ఎంపై ఆగ్రహం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఐటిడిఎ ఇన్చార్జి పిఒ, జెసి ఎంజె అభిషేక్ గౌడ హెచ్చరించారు. బుధవారం రాత్రి కందమామిడి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టడీ హవర్ లో ఉండాల్సిన ఉపాధ్యాయులు లేక పోవడంతో హెచ్ఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 6వ తరగతి, 10వ తరగతి స్టడీ హవర్లను సందర్శించారు. విద్యార్థులకు ఆంగ్ల పాఠ్యాంశాలను బోధించారు. విద్యా ప్రమాణాలు మెరుగుపడాలని హెచ్ఎంకు సూచించారు. వంట గదులను, స్టోర్ రూమ్లను పరిశీలించారు. విద్యార్థుల మెనూపై ఆరా తీశారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూను సక్రమంగా విద్యార్థులకు అందించాలని ఆదేశించారు. మళ్లీ వచ్చినప్పుడు ఉపాధ్యాయులు లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తీరం.. జనసంద్రం

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని రాజయ్యపేట ,బోయపాడు సముద్ర తీరాలు మాఘ పౌర్ణమి సందర్భంగా జనసంద్రంతో నిండాయి. బుధవారం మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని పెద్ద సంఖ్యలో భక్తులు రాజయ్యపేట, బోయపాడు సముద్ర తీరాలకు చేరుకుని సముద్ర స్నానాలు ఆచరించారు. తీర ప్రాంతం జన సంద్రముగా దర్శనమిచ్చింది. సి ఐ కుమారస్వామి, ఎస్ఐ సన్నిబాబుల ఆధ్వర్యంలో సముద్ర తీరం వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగ కుండా ముందస్తు ఏర్పాట్లు చేశారు. గజ ఈతగాళ్ళను అందుబాటులో ఉంచారు. ఎంపీడీవో డి సీతారామరాజు పంచాయతీ కార్యదర్శులతో కలిసి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మాఘ పౌర్ణమి సందర్భంగా వ్యాపారులు తీరంలో తినుబండరాల దుకాణాలు ఏర్పాటు చేసి వ్యాపారాలు సాగించారు .

చిరంజీవి, పవన్ కల్యాణ్ మాయలో పడొద్దు : కెఎ.పాల్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మెగాస్టార్ చిరంజీవి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ మాయలో ఎవరూ పడొద్దని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కెఎ.పాల్ విజ్ఞప్తి చేశారు. ఆశీలుమెట్ట వద్దగల తన వంక్రస్ హాల్లో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 70 ఏళ్ల వయసులో చిరంజీవి మతితప్పి కొత్త వేషం వేస్తున్నారన్నారు. రాజకీయాలకు దూరమని ప్రకటించి, మొన్న ప్రజారాజ్యమే జనసేనగా అవతరించిందన్నారని, అంతకు ముందు రాజకీయాలు చేయడానికి రాజకీయ నాయకులను కలుస్తున్నాని మాట్లాడుతున్నారని ఎద్దేవాచేశారు. చిరంజీవి, పవన్ కల్యాణ్‌కు రాజకీయాలు అవసరమా అని ప్రశ్నించారు. ప్రజారాజ్యం పార్టీని కాంగ్రెస్‌లో కలిపి చిరంజీవి మోసం చేశారని తాను చెప్పినదే జరిగిందన్నారు. పవన్ కల్యాణ్ జనసేన పార్టీని బిజెపికి ప్యాకేజీ పేరుతో అమ్మేశారని చెప్పానని, ఇప్పుడు అదే జరుగుతుందని తెలిపారు. పవన్ కల్యాణ్ ప్రజలకు ద్రోహం చంద్రబాబు మోసపోయారన్నారు. పవన్ కళ్యాణ్ 2019లో సిపిఐ, సిపిఎంతో కలిసి చంద్రబాబు నాయుడును తిట్టిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ ఎన్నికల్లో పవన్‌కు ఒక శాతం ఓట్లు కూడా రాలేదన్నారు. చిరంజీవి పవన్ కళ్యాణ్ పోటీకి మాట మార్చుతారని, పట్టించుకోవాల్సిన అవసరం లేదని చెప్పారు. పవన్ కల్యాణ్ భార్యా పిల్లల భద్రతకు తీసుకుపోయాని, ఈయనేమో సనాతన ధర్మం అంటున్నారని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో బిజెపి ముఖ్యమంత్రి అభ్యర్థిగా పోటీ చేయడానికి పవన్ కల్యాణ్ సిద్ధమవుతున్నారని, ఇది చంద్రబాబు తెలుసుకోవాలన్నారు. సూపర్ సిక్స్ పథకాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో ప్రజాశాంతి పార్టీదే గెలుపన్నారు. అధికారంలో ఉన్న బిజెపికి చిరంజీవి, పవన్ కల్యాణ్ తొత్తులుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

దొంగ ఓట్లతో ఢిల్లీలో గెలిచారు

ఇటీవల ఢిల్లీలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో దొంగ ఓట్లతో బిజెపి అధికారాన్ని కైవసం చేసుకుందని కెఎ.పాల్ ఆరోపించారు. ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసి, అదనంగా దొంగ ఓట్లను చేర్చి 400 నుంచి 500 ఓట్ల తేడాతో బిజెపి అభ్యర్థులు గెలిచారని పేర్కొన్నారు. బ్యాలెట్ ద్వారా ఎన్నికలు పెడితే బిజెపి అసలు రంగు బయట పడుతుందన్నారు.

సెవెన్ హిల్స్ హాస్పిటల్ కార్మికుల భిక్షాటన

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఎంజిఎం సెవెన్ హిల్స్ హాస్పిటల్ యాజమాన్యం జీతాలు చెల్లించకపోవడానికి నిరసనగా డాబాగార్డెన్స్‌లోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం కార్మికులు భిక్షాటన చేపట్టారు. నినాదాలు చేస్తూ ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా విశాఖ జిల్లా హాస్పిటల్ నర్సింగ్ హోమ్స్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి వై.రాజు మాట్లాడుతూ, గత మూడు నెలలుగా 38 మంది కార్మికులను హాస్పిటల్ యాజమాన్యం ఎటువంటి నోటీసులూ ఇవ్వకుండా తొలగించిందని తెలిపారు. దీనిపై డిప్యూటీ లేబర్ కమిషనర్‌కు యూనియన్ తరపున ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఆయన ఆదేశాల మేరకు వీరందరినీ తిరిగి విధుల్లోకి తీసుకున్నా జీతాలు మాత్రం చెల్లించటం లేదని తెలిపారు. దీంతో కార్మికులంతా తీవ్ర ఆర్థిక ఇబ్బందులు గురై, అప్పులతో పస్తులతో కాలం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. తొలగించిన కార్మికులకు ఆర్థికంగా సాయపడగలమనే ఉద్దేశంతో ఈ భిక్షాటన చేపట్టినట్లు తెలిపారు. యాజమాన్యం బకాయి జీతాలు చెల్లించాలని, లేకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. భిక్షాటనలో అధిక సంఖ్యలో కార్మికులు, మహిళలు పాల్గొన్నారు.

కల్యాణపులోవలో ఉత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు

ప్రజాశక్తి-కొత్తకోట: ఉత్తరాంధ్ర జిల్లాలో పేరుందిన కళ్యాణపులోవ పోతురాజు బాబు తిరునాళ్లకు ఏర్పాట్లు చురుగ్గా కొనసాగుతున్నాయి. ప్రతి ఏటా మహాశివరాత్రిని పురస్కరించుకొని ఈనెల 26, 27,28 తేదీలలో మూడు రోజుల పాటు నిర్వహించే తిరునాళ్లకు సుమారు మూడు లక్షల మంది భక్తులు హాజరవుతారు. ఈ కళ్యాణపులోవ జలాశయంలో స్నానాలు ఆచరించి కళ్యాణ పోతురాజు బాబు, పెద్దింటమ్మ ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆర్ డబ్ల్యూఎస్ జెఈ భగవంతరావు మాట్లాడుతూ మహా శివరాత్రి తీరు నాళ్ళు లో భాగంగా ఈ ఏడాది భక్తుల సౌకర్యార్థం మండల పరిషత్తు నిధులు రూ 25 లక్షలతో మరో నాలుగు స్నాన ఘట్టాలను నూతనంగా నిర్మిస్తున్నామన్నారు. గతంలో నిర్మించిన పాత స్నాన ఘట్టాలకు అను సంధానం చేస్తున్నట్టు పేర్కొన్నారు.

రోగులకు పాలు, పండ్లు పంపిణీ



రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ జమాల్‌ఖాన్, ఆసుపత్రి వైద్యులు

ప్రజాశక్తి-అల్లూరి జిల్లా : ప్రముఖ ఆయుర్వేద వైద్యులు మహమ్మద్ జమాల్ ఖాన్ జన్మదిన సందర్భంగా బుధవారం చింతూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో 60మంది రోగులకు, గర్భిణీలకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ కోటిరెడ్డి మాట్లాడుతూ జమాల్ ఖాన్ అందిస్తున్న సేవలు అమోఘమన్నారు. ఆసుపత్రిలో రోగులకు తాగునీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని ఆయనకు తెలియజేసిన వెంటనే రూ.65 వేలు వ్యయంతో తానే దగ్గరుండి బోరు వేయించారని తెలిపారు. జమాల్ ఖాన్ మాట్లాడుతూ నాలుగు మండలాలలో అత్యవసర సేవలు అందించే విషయంలో త్వరలోనే అంబులెన్స్ ఏర్పాటు చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు టి.జోష్నప్రియ భవాని, డాక్టర్ వై కృష్ణ, కౌశిక్ రెడ్డి, ఎల్ శ్రీహర్ష, ఎం.సాయి కిషోర్, ఎస్ శశికళ, వై రమణరావు, కే భరద్వాజ్, ట్రస్ట్ సభ్యులు నటరాజ్, రియాజ్, రసూల్, షాజహాన్, రాచూరి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దయానంద సరస్వతి జయంతి



వేడుకల్లో పాల్గొన్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం సీలేరు డిఏవి పాఠశాలలో స్వామి దయానంద సరస్వతి జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. డిఏవి పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిరణ్ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ స్వామి దయానంద సరస్వతి గొప్ప సంఘ సంస్కర్త అని, ఆయన సమాజాన్ని సంస్కరించి విధానం గురించి విద్యార్థులకు వివరించారు. ప్రతి ఒక్కరు ఆయన అడుగుజాడల్లో నడవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంబశివరాత్రి కార్యక్రమాలు పలువురుని ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు. విద్యార్థులు పాల్గొన్నారు.

15 నుంచి ఆయుర్వేద పంచకర్మ వైద్యశిబిరం

ప్రజాశక్తి-సీతమ్మధార : దీర్ఘకాల రోగాలకు ఆయుర్వేద పంచకర్మ విధానం ద్వారా చికిత్స అందించేందుకు ఈనెల 15 నుంచి 19 వరకు కేరళకు చెందిన ప్రసిద్ధ వైద్యులచే ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్టు కేరళ ఆయుర్వేద కేంద్రం వైద్యరాజ్ ఔషధాలయ మేనేజర్ దినూప్ తెలిపారు.

ఆయుర్వేద వైద్యులు డాక్టర్ కెఎం. ఉనినకృష్ణన్ అయిదు రోజుల పాటు అందుబాటులో ఉంటారని తెలిపారు. హైపర్ టెన్షన్ (ఆందోళన) , ఆర్థరైటీస్ (కీళ్ళ వ్యాధులు), పక్షవాతం, ఊబకాయం, ఆస్మా, నడుం నొప్పి, స్పాండిలైటిస్, మానసికఒత్తిడి, నిద్రలేమి, రుమాటిజం వంటి సమస్యలతో బాధపడే వారికి ప్రత్యేక వైద్య శిబిరంలో సేవలు అందిస్తారన్నారు. వివరాలు, అపాయింట్‌మెంట్‌కు రామ్‌నగర్ జివిఎంసి ఎదురుగా ఉన్న తమ కేంద్రంలోగానీ, 8008000670, 9030568264 నెంబర్లకు సంప్రదించాలన్నారు. 15,16,17 తేదీల్లో మురళీనగర్ శ్రీదేవి పార్క్ వద్ద, 18,19 తేదీల్లో రామ్‌నగర్ ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలోని కేంద్రంలో సేవలు పొందవచ్చని సూచించారు.

ప్రశ్నించి, పోరాడే సత్తా ఉన్న పిడిఎఫ్ అభ్యర్థి
విజయగౌరిని గెలిపించాలి

యుటిఎఫ్, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



యుటిఎఫ్, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి- పద్మనాభం : ప్రశ్నించి, పోరాడే సత్తా ఉన్నవారిని గెలిపిస్తే సమస్యలు పరిష్కారానికి ఆస్కారముంటుందని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.అంబేద్కర్ అన్నారు. ఈనెల 27న జరిగే ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరిని మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని కోరారు. బుధవారం మండలంలోని మద్ది, అనంతవరం, గంధవరం, పద్మనాభం. రెడ్డిపల్లి, విజయానందపురం, బిఆర్ తాళ్లవలస, రేవిడి, పాండ్రంగి గ్రామాల్లో పాఠశాలల్లో ఉపాధ్యాయ ఓటర్లను కలిసి ప్రచారం నిర్వహించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ, గత ప్రభుత్వం మొండిగా ఉన్నప్పటికీ, పోరాడి అనేక సమస్యలను పరిష్కరించుకోగలిగామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రాథమిక విద్యను విచ్చిన్నం చేయడానికి కుట్ర చేస్తోందన్నారు.ప్రభుత్వం అనుకున్నది జరిగితే గ్రామస్థాయిలో పేదలకు ప్రాథమిక విద్య దూరమౌతుందని ఆవేదన వెలిబుచ్చారు. ఈ నేపథ్యంలో సమస్యలపై ప్రశ్నించి, పోరాడే స్వభావం ఉన్న పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. చుక్కరామయ్య నుంచి పిడిఎఫ్ అభ్యర్థులంతా ప్రతిపాదించి, బలపరిచిన కోరెడ్ల విజయగౌరి ఉత్తరాంధ్ర నియోజకవర్గంలో పోటీలో ఉన్నారని, ఆమెను గెలిపించి, శాసనమండలికి పంపిద్దామని పిలుపునిచ్చారు. రాజకీయపార్టీల మద్దతుతో పోటీలో ఉన్న అభ్యర్థులను గెలిపిస్తే, ఆయా పార్టీలకు మద్దతుగా ఉంటారే తప్ప, ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యాసమస్యలపై పోరాడే ఆస్కారముండదన్నారు. జివిఎంసిలో సిపిఎం ఫ్లోర్‌లీడర్, కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ, ప్రజల కోసం మాట్లాడే వ్యక్తులు లేకపోతే పాలకులు ఇష్టరాజ్యంగా పాలన సాగిస్తారన్నారు. కార్మిక పోరాటంతోనే విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణపై నాలుగేళ్లుగా ప్రభుత్వాలు ముందుకు వెళ్లలేకపోతున్నాయన్నారు. విద్య, ఉపాధ్యాయ సమస్యలపై పోరాడే సత్తా, ప్రభుత్వాలను నిలదీసి ప్రశ్నించే ధైర్యం ఉన్న పిడిఎఫ్ తరపున పోటీలో ఉన్న విజయగౌరిని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ఎం.సత్య నారాయణ రెడ్డి కె. సన్యాసిరావు సిఐటియు నాయకులు ఆర్ఎస్ఎన్ మూర్తి, కె.సత్య నారాయణ పాల్గొన్నారు.

పోర్టు ఆసుపత్రి ప్రయివేటీకరణ టెండర్లు రద్దు చేయాల్సిందే

- 135వ రోజుకు నిరసన దీక్షలు

ప్రజాశక్తి- సీతమ్మధార : వాయిదాలు వేస్తూ వస్తున్న విశాఖ పోర్టు గోల్డెన్ జూబ్లీ ఆసుపత్రి ప్రయివేటీకరణ టెండర్లను పూర్తిగా రద్దు చేయాల్సిందేనని పోర్టు అండ్ డాక్ ఎంప్లాయిస్ యూనియన్, సిఐటియు గౌరవాధ్యక్షుడు పద్మనాభరాజు స్పష్టం చేశారు. పోర్టు ఆసుపత్రి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా బుధవారం 135వ రోజు నిరసన దీక్షలో మాట్లాడుతూ, టెండర్లకు వచ్చేవారికి అడ్డుకోవడం కాదని, వారిని తరిమికొడదామని పిలుపునిచ్చారు. 40వేలమంది పోర్టు ఉద్యోగులు, కార్మికులతోపాటు వారి కుటుంబాల ఆరోగ్యంతో ముడిపడిఉన్న పోర్టు అసుపత్రిని అభివృద్ధిపేరుతో ప్రయివేటుకు కట్టబెట్టాలనుకోవడం అనైతికమన్నారు. వేలాదికోట్ల రిజర్వ్‌ఫండ్స్, భూములు ఉన్న విశాఖ పోర్టు ఏటా జివిఎంసి రూ.65కోట్ల పన్నులు కడుతోందని, ఆ నిధులతోనే గ్రేటర్ విశాఖ పరిధిలో పలు అభివృద్ధి పనులు, సమస్యలను పరిష్కరిస్తుండగా, అటువంటిది పోర్టు ఆసుపత్రి అభివృద్ధికి సొంత నిధులు లేవాయని ప్రశ్నించారు. పోర్టు ఆసుపత్రి ప్రైవేటీకరణ కొనసాగితే, కార్మికులు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు కలిసి పెద్ద ఎత్తున ఉద్యమించేందుకు సిద్ధమని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె. సత్యనారాయణ, జె.సత్యనారాయణ, సిహెచ్ త్రినాధరావు, గణేష్, రెడ్డి ఈశ్వరరావు, నాయుడు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమ నిధి ఏర్పాటు

ప్రజాశక్తి- సీతమ్మధార : విశాఖలో వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమానికి రూ.10 లక్షలతో ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్స్ యూనియన్(ఎపిజెయు) సంక్షేమ నిధిని ఏర్పాటు చేస్తున్నట్టు యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు డాక్టర్ కంచర్ల అచ్యుతరావు వెల్లడించారు .బుధవారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో . చిరంజీవి కళాపీఠం ఆధ్వర్యంలో ఎపిజెయు గౌరవాధ్యక్షులుగా నియమితులైన డాక్టర్ కంచర్లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఉపకార్ ట్రస్ట్ ద్వారా నిరంతరం సేవా కార్యక్రమాలను చేపడుతున్న తనకు జర్నలిస్టులంటే ఎనలేని అభిమానమని, అందుకే వారి సంక్షేమానికి, ఆరోగ్యభరోసాకు ఈ నిధిని ఏర్పాటు చేశానన్నారు. జర్నలిస్టుల హౌసింగ్, అక్రిడిటేషన్లు, హెల్త్‌కార్డులు ఇతర సమస్యలపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిషాకరానికి కృషి చేస్తానన్నారు ఎపిజెయు రాష్ట్ర ప్రతినిధి పి.బాలభాను, విశ్రాంత ఎడిసిపి ఖాన్, ట్రస్టు ప్రతినిధులు తదితరులు పాల్గొని అచ్యుతరావుకు శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా చిన్నారుల నృత్యాలు, కోలాటం, సంగీతవిభావరి అలరించాయి.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 47వ వార్డు కంచరపాలెం సంపత్ వినాయక పార్వతీశ్వర సాయి ఆలయం రజతోత్సవ వార్షికోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ పెద్దలు, తిక్కవానిపాలెం కాలనీ, స్థానిక సంక్షేమ సంఘం పెద్దలు సతీష్‌ను సాదరంగా ఆహ్వానించి శాలువాతో సత్కరించి, మెమొంటో బహూకరించారు.ఆలయ అధ్యక్షులు గనకళ్ల శంకర్, వానపల్లి అప్పన్న, కోలా చంటి, గరికిన పరశురాం, సూరాడ కోటేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.

'గిరిజనులకు టిడిపి అండగా ఉంటుంది'

ప్రజాశక్తి-రంపచోడవరం : గిరిజనులకు తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి అన్నారు. బుధవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ దెయ్యాలు వేదాలు వల్లించినట్లు నేడు వైసిపి వ్యవహరించడం శోచనీయమన్నారు. వైసిపి నేతలు దుష్ప్రచారం చేస్తూ గిరిజనులను భయాందోళనకు గురి చేస్తున్నారని ఆరోపించారు. టిడిపి కూటమి ప్రభుత్వం 1/70 చట్టానికి మద్దతిస్తూనే ఉంటుందన్నారు. అలాగే జీవో నెంబర్ 3కి ప్రత్యామ్నాయం గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిశీలిస్తున్నారని తెలిపారు. జిఒ 3ను సుప్రీంకోర్టు కొట్టి వేస్తే రివ్యూ పిటిషన్ వేయాల్సిన నాటి వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని గుర్తు చేశారు.

ఆదివాసీ చట్టాల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

ఆదివాసీ చట్టాల అమలుకు టిడిపి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 1/70 చట్టం గురించి గిరిజనులు ఆందోళన చెందనవసరం లేదని తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వం మొదటి నుండి గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించినట్లు తెలిపారు.

గీతం దూరవిద్య కోర్సులలో ప్రవేశ గడువు పెంపు

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ (సిడిఒఇ) ఆధ్వర్యంలో దూరవిద్యా విధానంలో ఎంఎ ఇంగ్లీష్, బిఎ, బికాం డిగ్రీ కోర్సులలో 2025 విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు సిడిఇఒ డైరెక్టర్ డాక్టర్ టి.శ్రీనివాస్ తెలిపారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో సూచనల మేరకు ప్రవేశ దరఖాస్తు తేదీలను పొడిగించినట్లు తెలిపారు. పూర్తి చేసిన ధరఖాస్తులను వచ్చేనెల 31లోగా అందజేయాలన్నారు. పూర్తి సమాచారానికి దొండపర్తిలోని గీతం సిటీ సెంటర్‌ను సంప్రదించాలని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తులకు cdl.gitam.edu వెబ్‌సైట్‌ను పరిశీలించాలని సూచించారు.

పేదలకు దుప్పట్లు, ఆహారం వితరణ

ప్రజాశక్తి - ఆరిలోవ : నీలకంఠ దివాస్ వేడుకలను పురస్కరించుకొని పాతడెయిరీఫారం, ఇందిరానగర్‌లో ఉన్న ఆనంద్ మార్గ్ యూనివర్సల్ రిలీఫ్ బృందం బుధవారం నగరంలో పలు ప్రాంతాల్లో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆశ్రమంలో సామాజిక ధ్యానం అనంతరం ఆర్‌టిసి కాంప్లెక్స్, రైల్వేస్టేషన్, కాన్వెంట్‌జంక్షన్, ఇందిరానగర్, తదితర ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లపై ఉన్న పేదలకు దుప్పట్లు, ఆహార పొట్లాలు, బిస్కెట్లు, మంచినీటి బాటిళ్లను ఆనంద్‌మార్గ్ జిల్లా కమిటీ సభ్యులు అందజేసారు. ఆచార్య సౌమ్యానంద అవదూత ఆధ్వర్యంలో ఆచార్య త్రిలోకేశానంద, వసుంధర, కమిటీ సభ్యులు ఆర్ఎ.పాత్రో, చలం, రమేష్ పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కుల రక్షణకు కృషి

ప్రజాశక్తి- సీతమ్మధార : వినియోగదారుల హక్కులపై వారికి అవగాహన కల్పించి, వాటి రక్షణకు కృషి చేస్తానని నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ ఎపి వైస్ చైర్మన్ విశ్వనాధం యాదవ్ అన్నారు. కమిషన్ రాష్ట్ర చైర్మన్ శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో నేషనల్ చైర్మన్ సాయి రమేష్ నుంచి రాక్మి వైస్‌చైర్మన్‌గా నియామకపత్రాలు, గుర్తింపు కార్డులను పొందారు. కమిషన్ జాతీయ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యునిగా ఆదినారాయణ రాజు నియమితులయ్యారు.

ఈ సందర్భంగా విశ్వనాధం మాట్లాడుతూ దోపిడికి గురికాకుండా వనిఇయోగదారులకు వారి హకుకలపై అవగాహన కల్పిస్తానన్నారు. తనకీ బాధ్యతలు అప్పగించిన జాతీయ చైర్మన్ సాయి రమేష్, సౌత్ ఇండియా చైర్మన్ దాడి సత్యనారాయణలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నేషనల్ జాయింట్ సెక్రటరీ శ్రీనివాసరాజు, నేషనల్ డైరెక్టర్ దిలీప్‌రాజ్, సౌత్ ఇండియా జాయింట్ సెక్రటరీ సన్యాసిరావు, డివిజన్ చైర్మన్ షరీఫ్, కమిషన్ సభ్యులు పాల్గొన్నారు.

వాహన తనిఖీల స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి- సీతమ్మధార సీతమ్మధార రైతు బజార్ వద్ద ద్వారక ట్రాఫిక్ పోలీసులు వాహన తనిఖీల స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు ఈ సందర్భంగా ద్వారక ట్రాఫిక్ సిఐ ప్రసాద్ మాట్లాడుతూ వాహనదారులు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే చర్యలు తప్పవన్నారు. రైతుబజార్‌ను ఆనుకుని రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేసిన వాహనాలకు జరిమానా విధించారు. ద్వారక ట్రాఫిక్ ఎస్ఐ ప్రతాప్ కుమార్, పోలీసులు పాల్గొన్నారు.